అపశృతి

"పాట మానడం తప్ప జీవితంలో మే దండి. మన ట్టింట్లో పెద్దగాయనిగా మిద్దరం యేమైనా చేయగలం. హమతుల్ని మీ కందిస్తుంది."

అలా నవ్వేయడం కాదు. చూస్తూ ఉం ——తమ యిద్దరి ఫొటో కూర్చుని

చేతిలోని వెండికప్పును తన్మయత్వంతో చూస్తున్న కూతురితలను నిమురుతూ భర్తతో అంది శారద. నవ్వి, ఆ కప్పును తీసుకోబోయాడు రవిశంకర్. 'ఉహుఁ!' అని తల అడ్డంగా ఊపి, మాంత్రికుడి ప్రాణపు చిలుకని రాకుమారుడిలా గట్టిగా గుండెల కదుముకుని పట్టుకుంది చిన్నారి గీత. కారు ముందుకు దూసుకుపోయింది.

భవిష్యత్తుపై కలల బరువుతో అలసిపోయి, మర్నాడు చాలా ఆలస్యంగా నిద్రలేచింది శారద. ప్రక్కనే టేబుల్ మీద బెడ్‌కాఫీ చల్లారిపోయి నిరాశగా చూస్తోంది. నవ్వుకుని, బయటకు రాబోతూ, యెదురుగా వస్తున్న వంట మనిషిని,

"పాప కాఫీ త్రాగిందా ?" అనడిగింది.

"లేదమ్మా - ఇంకా లేవలేదు."

"రాత్రి ఫంక్షన్‌తో అలిసిపోయింది" అనుకుంటూ గదిలోకి వెళ్ళి కూతురుని లేపబోయి ఉలిక్కిపడింది. గీత ఒళ్ళు కాలిపోతోంది. అదిరిపడి, రగ్గు జాగ్రత్తగా కప్పి, భర్తకు చెప్పి, డాక్టరుకు కబురుపంపించింది.

వంచినతల ఎత్తకుండా పది నిముషాలు పరీక్షించిన డాక్టరు చివరకు ప్రక్కనేఉన్న కుర్చీలో కూర్చుంటూ, "నిన్న బయట ఏమైనా తిందా ?"- అని అడిగాడు. అంతవరకూ ఆదుర్దాతో నిలబడిపోయిన శారద, ఖంగారులో అతనేమడిగాడో అర్థంకాక, కొద్దిగా జ్ఞాపకం తెచ్చుకుంటూ, "ఆఁ! నిన్న ఫంక్షన్ నుంచి వచ్చేటప్పుడు హోటల్‌కు వెళ్ళాం" అంది.

"ఎందుకు వెళ్ళారు — ఊరంతా విషజ్వరం ఉంది. బయట ఏమీ తీసుకోవద్దని చెప్పానుగా - మీరన్నీ యిలాంటి పనులే చేస్తుంటారేం ?"-

—కోపంగా విరుచుకుపడిన డాక్టరు "డాక్టరుగారూ !" అంటున్న శారద కంఠంలోని భయాన్ని గుర్తించి, తనను తాను సంబాళించుకుంటూ, "సరేలెండి - నేవెళ్ళి మందు పంపిస్తాను. జాగ్రత్తగా యిస్తుండండి-" అన్నాడు అనునయంగా.

డాక్టరు వెనకే భారంగా అడుగులు వేస్తూ వెళ్ళుతున్న భర్తవేపు అయోమయంగా చూస్తూ గీత ప్రక్కనే కూలబడిపోయింది శారద. గలగలమంటూ పరిగెత్తే ప్రవాహం పరిసరాలను ప్రభావితం చేసేటట్లు, ఎప్పుడూ అల్లరితో హడావుడిచేసే గీత అచేతనంగా పడి ఉంది. నోరువిప్పి మాట్లాడలేని ఆ పిల్ల కంటివెంట కారుతున్న నీరు అతి నిశ్శబ్దంగా తలకు రెండువేపులా తలగడ మీద చోటు చేసుకుంటోం... అన్ని సంవత్సరాల దాంపత్య జీవితంలో మామూలు విషయంలా అణచి పెట్టబ

దీన అపశ్రుతిలాంటి అసంతృప్తి ఆ క్షణంలో కొండంతై, కూతురితల నిము రుతున్న శారద మనసు నాక్రమించు కుంది. ఏం జరగబోతోంది? ఉత్తర దక్షిణ ధృవాల కలయికవంటి తన దాంపత్య జీవితంలో చివరకు మిగలబో తున్న దేమిటి? కీడును శంకిస్తున్న శారద యెదురుగా ఉన్న వంశీమోహ మని చిత్రానికి అప్రయత్నంగా చేతులు జోడించింది. ఆమె చూపులు ఆ ప్రక్కనే ఉన్న ఫోటోపై నిలిచిపోయాయి. అది ఎనిమిది సంవత్సరాలక్రితం, మొదటి సారి మైక్ ముందు నిలబడి పాడుతున్న శారద ఛాయాచిత్రం. ఆనాడు

"వన్స్‌మోర్! ప్లీజ్ వన్స్‌మోర్!!" కేకలు హాలంతా ప్రతిధ్వనిస్తున్నా తనకు కానట్టే, పమిటకొంగు భుజాల చుట్టూ లాక్కుంటూ వేదిక దిగిన శారద ఎదురుగా వస్తున్న లెక్చరర్‌ని చూసి ప్రశ్నార్థకంగా నిలబడింది.

"అమ్మా శారదా! లాభంలేదమ్మా-కనీసం యింకో పాటైనా పాడకపోతే వీళ్లు ఊరుకోరు. వెళ్ళి పాడు-తప్పదు-వాళ్ళు వినడంలేదు"- అన్నాడు ఆదుర్దాగా వెనక్కు తిరిగి చూస్తూ.

"సార్ - నేను -" కంగారుగా ఏదో చెప్పబోయింది శారద.

"ఉఁ హుఁ! - నువ్వు పాడకపోతే ఊరుకోరు - ప్లీజ్ - వెళ్లు -" అన్నా డాయన కొద్ది శాసనం ధ్వనిస్తున్న స్వరంతో. గత్యంతరం లేక వెనక్కు తిరిగింది శారద. ఆమె కనిపించగానే మొదలయిన కరతాళధ్వనులు పాట మొదలయ్యేవరకూ ఆగలేదు. "సావిరహే తవ దీనా కృష్ణా!"- గోపాల దేవుని మురళీ నాదంలా పాట సాగిపో తోంది. అంతవరకూ గొడవచేస్తున్న వారంతా మంత్రబద్ధుల్లా నిశ్శబ్దంగా ఉండి పోయారు. జయదేవుని, మధుర భక్తి భావం ఆమె కంఠంలో మరింత తీయ దనాన్ని నింపుకుని వింటున్నవారిని తన్మయులనుచేసింది. శారద లోపలకు వెళ్ళిపోయేవరకూ కాని యెవరికీ పాట అయిపోయిందని తెలియలేదు. ఒక్క సారిగా హాలుని ముంచెత్తుతూ కరతాళ ధ్వనులు మిన్ను ముట్టాయి. వెనకాల నుంచి మళ్ళా ఎవరో అరిచారు "వన్స్ మోర్" అని. శారదను వేదిక పైకి పంపిన లెక్చరర్ వచ్చి కార్యక్రమానికి అంతరాయం కలిగించవద్దని విజ్ఞప్తి చేశాడు.

ప్రేక్షకులలోకి వచ్చి కూర్చున్న శారదకు యిదంతా కలలో జరుగుతు న్నట్లుగా ఉంది. ఆమె ప్రత్యేకించి సంగీతం నేర్చుకోలేదు. అయినా భగవంతు డిచ్చిన అమూల్యవరం ఆమె గాత్రం. బాల్యంనుంచి ప్రతి పనిలోనూ ప్రత్యేకత చూపించే పెద్దకూతురంటే అపేక్ష యెక్కువ రామనాధం మేష్టారికి. అయినా మగపిల్లలతోపాటు స్కూలుకు వెళ్ళే

కూతురు చదువు విషయమై పెద్ద ఆలోచనలేవీ లేవు ఆయనకు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కుటుంబంలో ముగ్గురు ఆడపిల్లలూ గుండెలపై కుంపట్లు మాత్రమే. తమ బరువును దించుకోవాలనే ఆరాటమే తప్ప పిల్లల కళాభినివేశాన్ని గుర్తించే సావకాశం వారికి లేదు. ఈ పరిస్థితుల్లో పక్కింటి స్నేహితురాలు సరళ సంగీతం నేర్చుకోవడం చూసిన శారద సరదాపడి, రోజూ అక్కడికి వెళ్ళి కూర్చుంటూ ఉండేది. సహజసిద్ధమయిన శారదలోని సంగీత జ్ఞానం దీనితో వికసించ నారంభించింది. ఉత్సాహాన్ని ఆపలేక, సన్నగా కూని రాగం తీసే ఆమె స్థితికి జాలిపడిన సంగీతం మేష్టారు కొన్ని కీర్తనలూ, అష్టపదులు సరళతో పాటు ఆమెకీ నేర్పారు.

మానవుడి భవిష్యత్తు అతడూహించుకుని, మలచుకున్న మార్గంలోనే ప్రత్యక్షమయితే "దైవనిర్ణయం" అనే పదం అంతగా జ్ఞాపకంరాదు. అయితే "అంతా వాడిదేభారం" అని చేతులు ముడుచుకు కూర్చోకుండా కూతురుపెళ్ళికై విశ్వప్రయత్నాలు చేస్తున్న రామనాధంగారి యింట్లో శారద స్కూలుకు ప్రథమంగా స్కూలుఫైనలు పాస్ అవడం ఒక ప్లవాన్నే తీసుకువచ్చింది. వంశంలో ఆమాత్రం చదివిన మొదటి ఆడపిల్ల శారద. పీసం సంబంధం కుదిరేవరకూ కాలేజీలో చదువుతానని రెండు రోజులు నిరశనవ్రతం చేసిన కూతురి కోరికకు తలఊపారు రామనాధంగారు.

కళాశాల వాతావరణానికి అలవాటు పడడానికి పూర్వమే శారద సంగీత ప్రతిభను గురించి అందరికీ తెలిసిపోయింది. జీవితంలో మొదటిసారి వేదికయెక్కి మైక్ ముందు నిలబడిన శారద ప్రేక్షకులను చూసి వణికిపోయింది. కాని పాట మొదలవగానే ఆవరించుకున్న నిశ్శబ్దం ఆమెకు ధైర్యాన్నిచ్చింది.

ఈవిధంగా మొదలయిన శారద పేరుప్రతిష్ఠలు అంతకంతకు ఎక్కువ కాసాగాయి. ఇప్పుడు విశ్వవిద్యాలయంలో ఎక్కడ ఏ ఉత్సవం జరిగినా అందులో శారదపాట తప్పనిసరిగా ఉంటోంది. ఎంత ముఖ్యమయిన క్లాసయినాసరే వదలి, పాడడానికి వెళ్ళాల్సిన అవసరాలు వస్తున్నాయి.

హటాత్తుగా లభించిన యీ ప్రత్యేకత అప్పుడే వ్యక్తిత్వాన్ని సంతరించుకుంటున్న శారదను ఉక్కిరిబిక్కిరి చేయసాగింది. ఆయస్కాంతంలా ఆకర్షిస్తున్న కీర్తిసౌధాన్ని అధిరోహించాలనే ఆకాంక్ష చదువునుకూడా నిర్లక్ష్యం చేసేటంతగా ప్రలోభపెట్టింది. ఫలితంగా, ఆర్నెల్ల పరీక్షల్లో అన్నిటిలోనూ తక్కువ మార్కులు వచ్చాయి. వరాన్వేషణలో ఉన్న రామనాధం గారికి



యీ విషయం అంతగా బాధించక పోయినా శారదమాత్రం మానసికంగా కృంగిపోయింది. ఇక నుంచి చదువు విషయమై శ్రద్ధ వహించాలి అనుకుంది దృఢంగా.

రాత్రి తీసుకున్న నిర్ణయం యిచ్చిన మనశ్శాంతితో మరునాడు కాలేజీకి వెళ్ళింది. క్లాసు జరుగుతుండగా శారదకు ప్రిన్స్‌పాల్‌గారి దగ్గరనుండి పిలుపు వచ్చింది. క్లాసంతా ఆమెవైపు ప్రశ్నార్థకంగా చూసింది. మనస్సును అవ్యక్త భయమేదో ఆవరిస్తుండగా ప్రిన్స్‌పాల్ దగ్గరకు వెళ్ళింది. అక్కడ లెక్చరర్ భాస్కరరావుగారు, మరో యిద్దరు విద్యార్థులతో ప్రిన్సిపాల్ నవ్వుతూ మాట్లాడుతున్నారు. నెమ్మదిగా దగ్గరకు వెళ్ళి, నమస్కారంచేసి, "పిలిచారట?" అనడిగింది.

"అవునమ్మా – నీకు ఒక విషయం చెప్పాలి" అన్నారాయన ఇటు తిరుగుతూ.

"ఏమిటండీ?"

"అదే వచ్చేనెలలో అంతర్విశ్వ విద్యాలయ పోటీలు మొదలవుతున్నాయిగా."

"అవునండీ – విన్నాను" అస్పష్టంగా అంది మనసులో ఏదో సందేహం పొగలాగ ఆవరిస్తుండగా.

"అందులో లలిత సంగీతానికి మన విశ్వ విద్యాలయం నుండి నిన్ను పంపాలనుకుంటున్నాం. మన భాస్కరరావు గారు ఆ విషయాలన్నీ చూస్తున్నారు. నీకు కావల్సిన అరేంజ్మెంట్స్ ఆయనకు చెప్తే రిహార్సల్స్ మొదలు పెట్టవచ్చు."

"సార్ - సార్ -" మాటకు అడ్డు వచ్చాడో విద్యార్థి.

"ఏమిటోయ్ ?"

"అదేనండీ - నాటకంలో అనార్కలీ వేస్తున్న ఉషాదేవిగారికి పాడటం రాదని..."

"అవునవును - అసలు విషయం మరచేపోయాను. ఉషకి పాడటం రాదట. అందుకని, ఆ పాటకూడా నువ్వే పాడమ్మా" - అన్నారాయన ఏక బిగిన మాట్లాడేస్తూ.

అందరితో పాటు గదిలోనుండి బయటకు మౌనంగా వచ్చేసింది శారద. ఆమె మనసు ఎందుకో బరువుగా ఉంది. మొదటిసారి కాలేజీలో గాయనిగా గుర్తించబడినప్పుడు కలిగిన ఉత్సాహం సంతృప్తి ఆ క్షణంలో ఎందుకో జ్ఞాపకం రాలేదు. కాలేజీలో జేరిన ముఖ్యోశయం మరుగున పడిపోతున్నట్లనిపించ సాగింది. ముభావంగానే రెండురోజులు రిహార్సల్స్‌కు వెళ్ళింది. కాని అక్కడ లభ్యమౌతున్న ఆదరాభిమానాలు ఆమె నాకట్టుకో సాగాయి. క్రమంగా మనసు సంగీతంవల్ల రానున్న పేరు ప్రఖ్యాతుల వైపే మొగ్గసాగింది.

ఇంటిలో శారద పెళ్ళి ప్రయత్నాలు తీవ్రం అయ్యాయి. అందరూ ఎంత తొందర పడుతున్నారో, ఆ పెళ్ళి అంత దూరంగా జరుగుతోంది. తిరిగి తిరిగి ఒక సంబంధం దగ్గర ఆగారు రామనాథంగారు. కట్నం కానుకలు సరిపెట్టుకుంటున్నంతలో. స్కూలు ఫైనలు నాలుగుసార్లు తప్పి వ్యవసాయంలోకి దిగిన ఆ పెళ్ళికొడుకక్కా, కాలేజీలో చదివే పిల్లతో పెళ్ళి "తగని పని"గా తోచింది. తిరిగిపోయిన ఆ సంబంధాన్ని కూడా చూస్తూ ఉండిపోయిన రామనాథంగారిలో ఒకే ఒక భయంకరమయిన సందేహం మిగిలిపోయింది. అది "కూతురుకి పై చదువులు చెప్పించి పొరపాటు చేసానా ?" అన్నది.

అంతర్విశ్వ విద్యాలయ సంగీత, నాటకపోటీలు దగ్గరకు వచ్చేసాయి. ఈమధ్య అనార్కలీ నాటకం రిహార్సల్స్‌కు శారద రోజూ వెడుతోంది. తిరిగి రావడం ఆలస్యమయినప్పుడు భాస్కరరావుగారు యింటివరకూ దిగబెడుతున్నారు. సాధారణంగా ఆయనతో ఒకరిద్దరు స్నేహితులుకూడా ఉంటుంటారు. అందులో ఎర్రగా, పొడుగ్గా, చిరునవ్వుతో, "ఇంకొకసారి చూడా లనిపించే" ఒక యువకుడు తప్పక వస్తుంటాడు. నటులకు సలహా లివ్వడంలో భాస్కరరావుగారు అతని సూచనలుకూడా పాటిస్తుంటారు. ఆరోజు శారద రాగానే భాస్కరరావుగారు ఆ యువకుని వేపు తిరిగి, "వీరే నేను చెప్పిన శారదగారు, ఈ సంవత్సరమే జేరారు. ఇక పాట సంగతి ఇప్పుడు నువ్వే వింటావుగా" అన్నారు.

చిరునవ్వుతో నమస్కారం చేసిన అతని పేరు రవిశంకర్ అనీ, ఆ కాలేజీలోనే బి. ఎ. పాసయి బిజినెస్ చేస్తున్నాడనీ తెలిసింది శారదకు.

రిహార్సల్స్ మధ్యలో యాదృచ్ఛికంగా భాస్కరరావుగారి వేపు చూసిన ఆమె, ఆయన ప్రక్కనుండి రెండు కళ్లు అత్యంతాసక్తితో తననే పరికిస్తుండడం గమనించి ఉలిక్కిపడింది. గుండెల్లోకి దూసుకుపోయి స్త్రీత్వాన్ని మేల్కొలుపుతున్నట్లున్న ఆ చూపుల్లో ఆశ్చర్యం, అన్వేషణ ఫలించిన సంతృప్తి, అభిమానంలాంటి భావాలెన్నో కలిసిపోయి, ముఖం ఎర్రబడిపోగా శారద తలదించుకునేట్లు చేసాయి. తరువాత రిహార్సల్స్ అయిపోయేవరకూ అతడలాగే చూస్తున్నట్లు గ్రహించింది శారద.

మర్నాడు, రెండోరోజు, ఆమర్నాడు కూడా రిహార్సల్స్‌కు రవిశంకర్ వచ్చాడు. అతని ప్రవర్తన నలుగురి దృష్టి నాకర్షిస్తుందేమో అని భయపడిన శారదకు క్రమంగా, అతని ఈ స్వేచ్ఛకు భాస్కరరావుగారి ఆమోదం, ప్రోత్సాహం ఉంటున్నాయనే సందేహం కలుగసాగింది. బలవంతంగా మనసు నదుపులోకి తెచ్చుకుని పాడుతున్న ఆమెకు రవిశంకర్ అనే అందమైన యువకుడు, తదేక ధ్యానంతో వింటున్నాడనీ, ఆ చూపులలోని ఆకర్షణలాంటిదేదో తనను పరవశింప జేస్తోందనీ హటాత్తుగా గుర్తువచ్చి ఒక్క క్షణం మైకం కమ్మినట్లయింది. తన సంగీతంలో లయ, గానంలో మాధుర్యం తన జీవన సర్వస్వం అయిన సలీమ్‌ని ఉద్దేశిస్తూ ప్రేమమయి అనార్కలీ పాడే ఆ గేయంలో శారద కీసారి కొత్త అర్థాలు, అందాలు కన్పించసాగాయి, పాటలోని మధుర భావం ఆమె నావేశించినట్లయి మనస్సును గిలిగింతలు పెట్టింది. ఎప్పటిలా ఈసారి అందులోని ప్రియాహ్వాన చరణాల్ని నిస్సంకోచంగా పాడలేకపోయింది.

అనుకున్నట్లే పోటీలలో శారదకు లలిత సంగీతంలో ప్రథమ బహుమతి రావడమే కాకుండా, అనార్కలీ పాటకు ప్రత్యేక బహుమతులు కూడా వచ్చాయి.

ఆరోజు క్లాసవగానే వచ్చేస్తున్న శారద భాస్కరరావుగారు పిలుస్తున్నారని తెలిసి స్టాఫ్ రూముకు వెళ్ళింది. ఒక్కరే ఏదో చదువుకుంటున్నారాయన. నమస్కారం చేసింది.

"ఎలా చదువుతున్నావు?" అడిగాడాయన పుస్తకం మూసేస్తూ.

"పర్వాలేదండీ — పిలిచారట?"

"అవునమ్మా — నీకో సంగతి చెప్పాలి."

"ఏమిటండీ?"

"నువ్వు అపార్థం చేసుకోకుండా విని,

సరిగా ఆలోచించుకుని సమాధానం చెప్పు."

"అలాగే - కాని ఏమిటది ?"

"రవి _ రవిశంకర్ అంటే నీకు చాలా అభిమానం కదూ ?"

అసందర్భంగాఉన్న ఆ ప్రశ్నకు శారద తెల్లబోయింది.

"హాస్యం కాదు సీరియస్‌గా అడుగుతున్నాను. నీ జవాబుకావాలి "

"ఎందుకండీ"- అప్రయత్నంగా అడిగింది.

"నీ కిష్టమయితే రవి నన్ను మీ నాన్నగారి దగ్గరకు రాయబారం పంపుతా నంటున్నాడు "

ఆయన వేపే చూస్తున్న శారద కళ్లు సిగ్గుతో వాలిపోయాయి. ఎర్రబడిపోయిన మొహాన్ని వంచుకుంది.

"జీవితంలో డబ్బు తప్ప ఆప్యాయతను నోచుకోని రవి సుఖపడాలంటే నీ చేతుల్లో ఉందమ్మా."

"అంటే ?"

"చిన్నప్పుడే రైలు ప్రమాదంలో తల్లీ తండ్రీ పోయారు. ఇన్నాళ్ళూ ఆస్తి వ్యవహారాలు చూసిన తాతగారుకూడ ఈమధ్యనే పోయారు."

ఆయన చెప్తున్నది శారదకు వినిపించడంలేదు. తనలోని స్త్రీత్వాన్ని మేల్కొలుపుతున్న చూపులతో ఏదేక ధ్యానంతో పాటవినే రవిశంకర్ రూపమే మనసంతా ఆక్రమించుకుంది. అందని చందమామ హటాత్తుగా అరచేతిలో ప్రత్యక్షమయిన సంతృప్తితో హృదయం నిండిపోగా, వినీ వినబడకుండా అంది-

"ఇష్టం."

"బావుందమ్మా - మంచిరోజు చూసి మీ నాన్నగారితో మాట్లాడతాను."

తరువాత వారం రోజులకు ఏదో ఉత్సవంలో లలితసంగీతం పాడటానికి వెళ్ళి, ఒంటరిగా గ్రీన్ రూమ్‌లో తంబుర శ్రుతి చేస్తూ కూర్చున్న శారద గుమ్మం వేపు చూస్తూనే ఉలిక్కిపడింది. ఒడిచేతో గుమ్మం పట్టుకుని నిలబడిఉన్నాడు రవి శంకర్. ఏదో పనిమీద గదిలోకిరాబోయి, హటాత్తుగా ఆమెనుచూసి ఆగిపోయి నట్టున్నాడు - కుడికాలు ముందుకు సాచివుంది. ఆసక్తితోనిండిన ఆకళ్ళల్లో యీసారి చిలిపితనం, అధికారం, ఆశించి నది లభించిన సంతృప్తి మెరుస్తున్నాయి. తంబుర పక్కనపెట్టి, తొట్రుపడుతూలేచి నిలబడింది శారద. రెండు నిముషాలు అలాగే ఆమెకళ్ళల్లో ఏదో వెతుకుతున్నట్లు చూస్తూ నిలబడిపోయిన అతను, అంతలోనే మామూలుమనిషి అయిపోతూ చిరునవ్వుతో నమస్కారం చేశాడు. అప్రయత్నంగా ప్రతి నమస్కారం చేసిన శారద అతను గుమ్మంలోంచి కదలి, తనకు దగ్గరగారావడం గుర్తించనేలేదు. హటాత్తుగా రెండుచేతులా ఆమెను దగ్గరకు లాక్కున్నాడు రవి శంకర్. తూలి గుండెలమీద పడిన



శారద మరుక్షణం మొహం ఎర్రబడగా, అతని ప్రణయ ప్రకటనకు వణికిపోయిన పెదవులను పళ్ళతో నొక్కిపెడుతూ అతని చేతులు విడిపించుకుని అక్కడి నుంచి పారిపోయింది.

ఆ వేసవిలోనే శారద వివాహం రవిశంకర్‌తో జరిగిపోయింది. జంటగా, "రవిమందిర్" అధికారిణిగా రెండంతస్థుల భవంతిలో అడుగుపెట్టిన ఆమె మనసు విచిత్రానుభూతులకి లోనయింది. ఆ భావాలేమిటో అర్థంకాలేదామెకు. కాని ఆ ఆడంబరం వెనుక ఆ ఆహ్వానాల చాటున ఆ ఆప్యాయతల నడుమ అర్థం కాని వెలితి, లోటు ఉన్నాయనిపిస్తోంది.

కాని ఆ గీతలో ఏమున్నదో ఏమిటో తెలియలేదు ఆమెకు.

సాయంత్రం మొదలు... స్త్రీ పురుషుల జీవితాలని మధురంగా మార్చివేసే మొదటిరాత్రి శారద జీవితంలోకూడా వచ్చింది. ఆ మొదటిరాత్రికి ఆమెను సాయత్త పరచడానికి పుట్టింటివాళ్ళెవరూ వెంట లేరు. అలంకరింపబడ్డ ప్రక్కింటి వాడలో పుణ్యావంతాలంటిని చూసింది శారద. అది ఎందుకో తెలియలేదు.

చేతిలో పాలగ్లాసుతో పాలనురుగు వంటి తెల్లచీరలో తలలో విచ్చుకుని పకపక నవ్వుకుంటున్న మల్లెలతో, మనసులో మధురోహలతో తలుపుదగ్గరే నిలబడిపోయిన శారదహస్తాన్ని తన చేతిలోకి తీసుకున్నాడు రవి. శారద మనస్సు, రెక్కలు విచ్చుకున్న గువ్వలా ఒక్కసారి ఆనంద లోకాలలోకి ఎగిరి పోయింది. అంతలోనే, టేబుల్‌పైన ఓపెన్ చేసిఉన్న నోట్ బుక్ ఆమెకిచ్చాడు రవి. భర్తవేపు ఒకసారిచూసి ఆత్రుతగా అది చదివింది శారద.

"గానకోకిలవైన నీయీ త్యాగానికి ప్రతిగా యేమివ్వగలను నేను. ఈ యైశ్వర్యంతోపాటు నన్ను నేనే నీకు అర్పించుకుంటున్నాను. ఇకనుంచి నా వాక్కుపై నన్నూ యీ సర్వస్వాన్నీ శాసించి పాలించేఅధికారం నీది –" అని ఉంది. మొదట శారదకు దానిభావం అర్థం కాలేదు. అతి తొందరగా అయోమయంగా ఆమెచూపులు అక్షరాల వెంట పరుగెత్తాయి. దానిభావం అర్థం అయ్యేంతలోనే చరాచర ప్రపంచమంతా గిర్రున తిరుగుతున్నట్లూ, కాళ్ళక్రింద హిమనదాలు ప్రవహిస్తున్నట్లూ, "రవితో వివాహం" అన్నమాట విన్నప్పటినుంచి నిర్మించుకున్న భవిష్యహర్మ్యం పునాదులతో కూలిపోయినట్లూ అయి – మరునిముషంలో అచేతనంగా వాలిపోయింది శారద. పడిపోతున్న భార్యను కంగారుతో పొదివిపట్టుకుని తెలివి తెప్పించడానికి ప్రయత్నించసాగాడు రవి. ఒక పావుగంటకు తేరుకుని అయోమయంగా చైతన్యరహితంగా భావశూన్యంగా తన మొహంలోకే చూస్తున్న శారద చూపులు అతణ్ణి విచలితుణ్ణి చేశాయి. నెమ్మదిగా అక్కడనుంచి లేచి ప్రక్కనే పడిఉన్న నోట్ బుక్ తీసి ఏదో వ్రాసి ఆమెకిచ్చాడు.

"మాటరాని నా అశక్తత ముందే తెలిసికూడా యిలా క్రొత్తగా బాధ పడటంలో అర్థంలేదు –" అని ఉంది.

"తనకు ముందే తెలియడం" ??

ఈ మాటకే తెల్లబోతున్న శారదను –

"నువ్వు ఒప్పుకున్న తర్వాతనే..." అర్థోక్తిలో ఆగిపోయిన వాక్యం మరింత అయోమయానికి గురిచేసింది.

"అబద్ధం – అంతా మోసం – నాకు చెప్పకుండా దాచి, నా బ్రతుకు నాశనం చేసారు–" హఠాత్తుగా అరచినట్టుగా అంది శారద. ఆమెలోని అణువణువూ



అసహ్యం, ద్వేషం, కోపం, నిస్పృహా యత, అవమానంతో నిండిపోయింది. భర్త నీడనుకూడా భరించలేనిదానిలా, నెమ్మదిగా గోడవేపు తిరిగి పడుకుంది. నిస్త్రాణైపై పిలబడిపోయిన రవి బరువుగా నిట్టూర్చి, కదిలి వెళ్ళి తన జీవితంలో వెలుగులా దీపం ఆర్పివేసి, హృదయా న్నాపరించుకున్న మాంద్యతలాంటి బెడ్ లైట్ వెలుగులో నెమ్మదిగా వచ్చి, ఆమె ప్రక్కగా నిద్రపోవడానికి చోటు చేసుకు కళ్ళు మూసుకున్నాడు.

అటు తిరిగి పడుకుందే కాని మన సులో అగ్నిపర్వతాలు బ్రద్దలవడం అంటే ఏమిటో తెలియసాగింది శారదకు. అంత సౌమ్యుడిగా పరిచయమయిన రవిలో ఎదుటివ్యక్తి భవిష్యత్తుతో చెల గాట మాడగల కఠినత్వం ఎక్కడ దాగుందో అర్థంకాలేదామెకు. అయినా ఆ కఠోర సత్యంనుంచి తనను దూరంగా ఉంచలేదని అంటున్నాడు, ఇది నిజమా? కాక, అతని నాటకంలో భాగమేనా? ఎందుకనో శారద మనస్సు అదంతా వంచనగా అంగీకరించలేకపోతోంది. హటాత్తుగా ఆమెకు భాస్కరరావుగారి సంభాషణ జ్ఞాపకం వచ్చింది. ఆ మాటల్లో ఎక్కడా యీ ప్రసక్తి రాలేదు. అంటే ఆయన ఉద్దేశ పూర్వకంగా చెప్పలేదా — లేక తనకు తెలుసనను కున్నారా? ఎవరి పొరపాటుకు ఫలితం యిది? హద్దులతో ఎదురయిన అదృ ష్టాన్ని అంగీకరించడం ఎలా? — వణు కుతున్న చేతులతో చరాలున మొహం కప్పుకుని దిండులో తలదాచుకుంది. ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి.

సరికొత్తదయిన ఆ నిశ్శబ్ద వాతావర ణంలో అరగంట గడిచింది. నెమ్మదిగా

తల త్రిప్పి భర్తను చూసింది. నిద్రిస్తున్న రవి మొహం లజ్జాభిమానాలతో ముకుళించుకుపోయింది. తమ పరిచయమయిన తొలిదినాలు గుర్తుకువచ్చాయి. ఆ రోజులలో అతనంటే ప్రత్యేకాభిమానం ఏర్పడింది. అది ప్రేమో కాదో ఆలోచించలేదు యెప్పుడూ. కాని గాంభీర్యంతో మిళితమైన అతని సౌమ్య ప్రవర్తన తన నాకర్షించిన మాట నిజం. అంతలోనే ఒక విషయం జ్ఞాపకం వచ్చింది శారదకు. అదు, అప్రయత్నంగా తను అతని సన్నిధిని కోరుకున్న రోజులలో ఎప్పుడూ నోరువిప్పి అతను ఒక్క మాటకూడా అనలేదని. అయినా తానా విషయమే గుర్తించలేదని ... కేవలం రవి సాన్నిధ్యమే తనను పరితృప్తను చేసిందా ? మరి, అతని లోపం తన కోరిక తీరిన శుభసమయంలో కలచివేస్తున్నదెందుకు ?

శారద మనస్సు క్రమంగా మబ్బు విడిన మేఘంలా నిర్మలం కాసాగింది. ఆలోచనల బరువుతో యెప్పుడు రవి గుండెలపై వాలిపోయిందో ఆమెకు తెలియదు కాని అతని చేతులు ఆకాంక్షతో చుట్టివేయగా మెరిసిపోతున్న ఆ కళ్ళలోకి చూడలేక సిగ్గుతో తలవాల్చింది.

* * *

ఆరోజు ఆదివారం. పుస్తకం చదువుకుంటూ కూర్చున్న శారద దగ్గరకు యిద్దరు స్నేహితులతో వచ్చాడు రవి. వారిలో ఒకరు ప్రఖ్యాత గాయకుడు మురళీధర్, రెండవవారు గేయరచయిత విజయసారధి. మాటల సందర్భంలో శారదకూడా గాయని అని విని వారు ఆమెను రేడియోలో పాడించమంటూ సలహా యిచ్చారు. సంభ్రమంతో తల ఊపుతున్న భర్త కళ్ళలో ఒక్క క్షణం తళుక్కుమన్న విచిత్రమైన మెరుపును గుర్తించి ఆశ్చర్యపడింది శారద. కాని సంగీతం పేరు చెబితేనే గంతులువేసే ఆమె మనసు యీసారి మూగపోయినట్లయింది. అంతగా ఉత్సాహం చూపని భార్యను తనకోసం గాంధారీ వ్రతం పట్టడం సమంజసం కాదని వాదించాడు రవి.

ఇప్పుడు ఆకాశవాణిలో తరచూ శారదపాటలు వస్తున్నాయి. గాయని శారదారవిగా నలుగురిలో గుర్తింపు కలుగుతోంది. ప్రేక్షకులలో మొదటి వరుసలో తప్పనిసరిగ రవి వుంటాడు. కాలేజీ రోజుల్లోలాగే నిత్యాలంకారం వంటి చిరునవ్వు అతని పెదిమలపై మెరుస్తుంటుంది. అయితే ఆ మెరుపులో యిప్పుడు పరిపూర్ణత్వం ఉంది.

తనను ప్రాణంగా చూచుకొనే భర్త లోపాన్ని శారద మరచిపోవడానికి ప్రయత్నిస్తున్నా, ఆమె పరిచయమౌతున్న ప్రపంచం సరికొత్త విషయంగా చర్చిస్తోంది. తన ఎదురుగానే గుసగుసలకు అర్థం తెలిసిన శారద



మనస్సు ఒక్క క్షణం ఉండేలు దెబ్బతిన్న పక్షిలా విలవిల లాడుతుంటుంది.

ఆరోజు రేడియో స్టేషనులో అప్పుడే రికార్డింగ్ పూర్తి చేసుకుని లాంజ్‌లో కూర్చోవడానికి వస్తున్నారు శారదా, రవి. అంతలోనే వెనకాలనుంచి — "ఆ వెళు తున్నామె శ్రీమతి శారదారవి. మంచి గాయని. దేవుడు తెలివితక్కువ పనులు కూడా చేస్తుంటాడు. అంత మంచి గాయని భర్త మూగవాడు. ఎప్పుడూ సంతోషంగానే కనిపిస్తుంది కాని మనసులో ఎంత బాధపడుతుందో పాపం!"

—శారద అభిమాని యెవరో అంటున్నారు. ఉలిక్కిపడి, ప్రక్కనే ఉన్న భర్త మొహంలోకి కంగారుగా చూసింది శారద. కాని యేభావం ఆమెకు వ్యక్తంకాలేదు. భయంకరమైన మౌనం ఇద్దరిమధ్యా విలయతాండవం చేస్తుండగా వెళ్ళి కారులో కూర్చున్నారు. తప్పుచేసిన దానిలా ఉండిపోయిన శారద

మధ్యదారిలో హటాత్తుగా తలయెత్తి భర్తవేపుచూస్తూ. "వాళ్ళు - వాళ్ళు అనుకున్నది అబద్ధం" అంది. కారు వింగ్ లోంచి దూరమైపోతున్న నౌబత్ పహాడ్ వేపే చూస్తున్న రవి నెమ్మదిగా యిటు తిరిగి చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వులో తన మనసు నర్థంచేసుకున్న విశాలత్వం కనిపించింది ఆమెకు.

జీవితంలో తనకు యెదురయినది అదృష్టమో దురదృష్టమో తెలియని అయోమయావస్థలో ఉండగానే, తన ప్రశ్నలకు జవాబుగా, "ఇది మోసం, అన్యాయం" అంటూ ఉండీ ఉండి గగ్గోలుపెట్టే మనసుకు ఊరటగా శారద తను తల్లి కాబోతున్నట్లు తెలుసుకుంది.

ఆరోజు ఏదో పనిమీద వంటింట్లోకి వస్తున్న శారద లోపలినుంచి మాటలు విని ఆగిపోయింది. వంటమనిషి పని దానితో అంటోంది.

"నీదంతా మరీచోద్యం. మూగవాళ్ళ పిల్లలు మూగకాకుండా మామూలుగా ఉంటారా ఏం? ఇంతకీ శారదమ్మ అదృష్టం మంచిది కాదు. బంగారప్పు బొమ్మలాంటిపిల్ల. ఆ అమ్మ పాట విన్నప్పుడల్లా నా గుండె తరుక్కుపోతూఉంది. ఎటువంటి పిల్లకు ఎలాంటి భర్తను రాసిపెట్టాడు దేవుడు."

ఆవిడ ధోరణి సాగిపోతోంది. అప్పటికే తూలిపోతున్న శారద ఇక నిలబడ లేక తన గదిలోకి వచ్చేసింది. ఆమె మస్తిష్కం మొద్దుబారిన ట్లయిపోయింది. ఈ యింటి నావరించుకున్న భయంకర మూకాంధకారంలో ఎక్కడో దూరంగా మిణుకుమంటున్న తన ఆశాజ్యోతి, తన సర్వస్వం తన పాపకూడ, మాట్లాడకుండ సత్యాగ్రహం చేస్తుంది. తన చైతన్యాన్ని పణంగా తీసుకున్న ఈ భయంకర మూకత్వంతో, ఆప్యాయంగా ఎవరూ పలుకరించనైనా పలుకరించని ఈ నిశ్శబ్ద జీవితంలో చెవులార మన సంతా నిండిపోగా "తనవారి" - ఒక్క మాట వినడానికై చాతకపక్షిలా ఎదురు చూడాలి. ఈ అనంతమైన నిరీక్షణలోనే తన బ్రతుకు అంతమయిపోతుంది. శారదలో విశృంఖలంగా విజృంభించిన భావనలన్నీ వికృతరూపాలుదాల్చి బాహువులు చాచి ఆమెను చుట్టుముట్టినయి.

అప్పుడే లోపలకు వచ్చిన రవి గది చీకటిగా ఉండడానికి ఆశ్చర్యపడుతూ దీపం వెలిగించాడు. శ్రావణమేఘాన్ని శరశ్చంద్రికలా అంతటా చల్లనికాంతి ఆవరించుకుంది. తలత్రిప్పి చూసిన అత నికి తెలివితప్పి కుర్చీలోపడివున్న శారద కనిపించింది.

ఒకొక్క మాసమే గడుస్తున్నకొద్దీ శారదలో పాపతోబాటు సందేహాస్పద మైపోయిన పాప భవిష్యత్తును గురించిన భయాందోళనలుకూడా పెరగసాగాయి. నవ్వుతూ మాట్లాడుతూనే హటాత్తుగా ఆగిపోయి తనమీదుగా ఎక్కడో శూన్యం

లోకిచూస్తూ ఆలోచనలలో పడిపోయే భార్య ప్రవర్తన అర్థంకాకుండా పోతోంది రవికి.

తన కలలపంట ఆడపిల్లగా తెలిసినప్పుడు శారద మనోభావాలు అనూహ్యం. మాతృత్వపు మమతను భయాందోళనలు పెనవేసుకుంటుండగా ప్రశాంతంగా సంతృప్తితో చిరునవ్వు నవ్వలేకపోయింది. పాలుత్రాగుతున్న పాపతలను మృదువుగా నిమిరే ఆమెచేయి హటాత్తుగా వణికిపోయేది. ఒడిలో ఆడుకుంటున్న పాపను రెండుచేతులా నిలబెట్టి

"పాపా ఒక్కసారి నన్ను అమ్మా అను. నాతో ఒక్కసారి మాట్లాడు తల్లీ" అని అడగాలనిపించే ఉద్విగ్నతను నిగ్రహించుకోలేకపోయేది. కొన్ని తిసతప

ఆడిస్తూ ఎత్తుకోమని చేతులందించి బోసి నోటితో నవ్వే పాప భంగిమ మాటలాడలేక పడుతున్న యాతనలా కనిపించి దగ్గరకు వెళ్ళడానికే భయపడిపోయేది. మొదటిసారి గీత "అమ్మా" అని పిలిచినప్పుడు శారద కలవరించి మేల్కొన్నదానిలా నిలబడిపోయింది. తను విన్నది నిజమేనని నమ్మకం కలగగానే అప్రయత్నంగా,

"ఏమండీ మనగీత మాట్లాడుతోంది. హమ్మయ్య యిక ఫర్వాలేదు. నా భయం తీరిపోయింది" అని అరిచినట్టుగా అంది. సంభ్రమంగా కూతురివేపే చూస్తున్న రవి ఎదురుచూడని ఆ మాటలకు తెల్లబోయాడు. అప్పటికి తానన్న దేమిటో తెలుసుకున్న శారద హటాత్తుగా వణికిపోయి తలయెత్తి చూడలేక చేతులలో ముఖం దాచుకుని అక్కడనుంచి గబగబా వెళ్ళిపోయింది. ఇన్నాళ్ళుగా బోధపడకుండా వేధిస్తున్న భార్యచూపుల భావం చటుక్కున స్ఫురించిన రవి మనసు జ్ఞావమానాలతో ముకుళించుకు పోయింది.

హటాత్తుగా గతంనుండి ప్రస్తుతంలోకి వచ్చిన శారద "అమ్మా! గీతా!" అంటూ కూతురి భుజంపట్టి కుదుపబోయింది. గుమ్మంలో నిలబడి భార్య మొహంలో మధురగాయని శారదా రవి ఆశాశిఖరం కరిగిపోవడం చూస్తున్న రవి ఒక్క ఉదుటున వచ్చి ఆమె నాపివేశాడు. స్వప్నావశిష్టలా అతనివేపు తిరిగిన శారద కళ్ళనుండి సరస్వతివీణ విషాదస్వరాలు పలికినట్టు రెండు నీటి బిందువులు రాలాయి.

తెల్లవారింది. కూర్చున్న చోటనే కునుకుపట్టిన శారదకు మెలకువ వచ్చింది. పడక్కుర్చీలో వాలి నిద్రపోతున్న భర్త కనిపించాడు. నెమ్మదిగా లేచి లైట్ ఆర్పడానికి టేబుల్ దగ్గరికి వచ్చింది. రవి డైరీ తెరిచిపెట్టి ఉంది అక్కడ. ఏదో వ్రాస్తూ అలాగే ఉంచేసినట్టున్నాడు, పెన్ పేజీల మధ్య ఉండిపోయింది. దానిని యథాస్థానంలో పెట్టబోయిన శారద చేతులు అప్రయత్నంగా ఆ పేజీ తిరగవేసాయి. ఒక్క క్షణం సందేహించినా ఏమి వ్రాసాడో చూసింది. అందులో రెండే వాక్యాలు ఉన్నాయి.

"ప్రేమని ప్రకటించి అపరాధం చేశాను నేను. నా ప్రేమను ఆరాధనగా మార్చుకొని ఉంటే నా ఆరాధ్య దేవత యింకెక్కడయినా సుఖపడి ఉండేది. భగవాన్! శారదను పెళ్ళి చేసుకోవడంలో పొరపాటు చేసాను. నాదనుకున్న ఆ మనస్సులో కష్టానికి నాకు చోటు లేదని రాత్రి శారద కళ్ళు నాకు చెప్పాయి."

చదవడం పూర్తి అయ్యేసరికి శారద కళ్ళు వర్షిస్తున్నాయి. కళ్ళు తుడుచుకుని మళ్ళా డైరీలోకి దృష్టి సారించిన ఆమెకు ఆ వాక్యాలలో ఎనిమిది సంవత్సరాల నాడు గ్రీన్ రూమ్ గుమ్మంలో నిలబడి మంత్రముగ్ధుడిలా తన కళ్ళలోకి చూస్తున్న రవి కనిపిం

వాడు. వణికిపోయింది శారద. ఆమె మనస్సును చీల్చుకుంటూ వెలువడిన "లేదు లేదు" అన్న పదాలు నరనరాల్లోకి పరిగెత్తాయి. ఇక అక్కడ నిలబడలేక గబగబా గది బయటకు వచ్చేసింది.

డాక్టరు సలహాప్రకారం ఆ రోజు ఉదయం పదిగంటల ప్రాంతంలో హైదరాబాదులోకల్లా పెద్దదయిన ఒక నర్సింగ్ హోమ్‌లో గీతకు గది యేర్పాటు చేయబడింది. బొంబాయి నుండి ఇద్దరు నిపుణులుకూడా వచ్చారు. వాండరు యెన్నివిధాల ప్రయత్నించినా, ఒక్కగానొక్క కూతురుకూడా మాట్లాడే అర్హతను కోల్పోతే యేంచేయాలో ప్రశ్నైనా కనీసం తల్లికి మిగల్చకుండా అనంతప్రకృతిలో విశ్వంతో కలిసిపోయింది గీత. చనిపోయే సమయంలో కూడా చిన్నారి గీత చేతిలోనే ఉన్న వెండికప్పు పట్టుకొని కన్నీటి ధారతో క్రిందపడి పొర్లుతూ ఏడ్చి మంచం ప్రక్కగా రవి ఒడిలో తెలివితప్పి పడి ఉన్న శారద సాహసం లగెరి ఆగి పోయింది.

గీత పోయిన పదిహేనురోజులకు పుట్టింటినుంచి వచ్చింది శారద. ఎప్పటిలా తన చేతిని ఆప్యాయంగా తీసుకునే మృదుహస్తం యీరోజు లేదు. కూలిపోతున్న భార్యను పట్టుకుని నడిపిస్తూ నెమ్మదిగా లోపలికి తీసుకువచ్చాడు రవి. గది గుమ్మంలో అడుగుపెట్టిన శారదకు ఎదురుగా టేబుల్‌మీద గీత ఫోటో, ప్రక్కనే వెండికప్పు కనిపించాయి. భర్త చేయి విడిపించుకుని నెమ్మదిగా అక్కడకు వెళ్ళింది. అప్పటికే ఆమె కళ్ళల్లో నీరు సుడులు తిరుగుతోంది. కన్నీటిపొరల మధ్య, మసకగా కనిపిస్తున్న కప్పు క్రింద ఒక కవరు ఉంది. కళ్ళు తుడుచుకుని వణుకుతున్న చేతులతో దానిని విప్పింది. చదువుతున్నకొద్దీ శారద మొహంలో కోపం, విచారం, భయం, అసహ్యం — అన్నీ కలిసిపోయిన ఒక భయంకర భావం కదలాడసాగింది. ఎదురుగా ఉన్న అద్దంలోనుంచి ఆమెనే చూస్తున్న రవిని కలవరపెట్టింది. చదవడం పూర్తిచేసి శారద ఆ చూపులే మరల్చి కవర్‌పై వెయిట్‌గా పెట్టబడిన వెండికప్పుని ఒక్కసారి చూసి మరుక్షణంలోనే కవర్ని ముక్కలుగా చింపి ఆ కప్పులో పోసేసింది. గబగబా కదలి వచ్చిన రవి అప్పటికే అచేతనంగా వాలిపోతున్న భార్యను పొదివిపట్టుకున్నాడు. ఆమెను మంచంపై పడుకోపెట్టి, నెమ్మదిగా ఆ కాగితం ముక్కల్ని ఏరి కూర్చి విషయం తెలుసుకోడానికి ప్రయత్నించసాగాడు. అది రేడియో స్టేషన్ నుంచి శారదను పాట రికార్డింగ్‌కు ఆహ్వానిస్తూ వచ్చిన కాంట్రాక్టు ఫారం.

పావుగంట తర్వాత భర్త ఒడిలో కళ్ళు తెరిచింది శారద. ఆశ్చర్యంగా తన మొహంలోకి చూస్తూ ఉండిపోయిన అతని కనుకొనలు చెమర్చినట్టు అనిపించింది రవికి. అంతలో శారద అన్నది

"ఇక నేను పాడను!"

—అంటుండగా మధురమయిన ఆమె గొంతు భయంకరంగా వణికింది.